క్లుప్తంగా

అరకు ఎంపీ మాధవి దృష్టికి గ్రామాల సమస్యలు



అరకు ఎంపీ మాధవికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంపీటీసీ సభ్యుడు ఆనంద్‌కుమార్

అరకులోయ రూరల్: అరకు ఎంపీ గొడ్డేటి మాధవి దృష్టికి స్థానిక సమస్యలు విన్నవించినట్టు అరకులోయ టౌన్ ఎంపీటీసీ సభ్యుడు దురియా ఆనంద్‌కుమార్ తెలిపారు. అరకు ఎంపీ గొడ్డేటి మాధవి స్వగ్రామం శరభన్నపాలెంలోని ఆమె నివాసంలో మంగళవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిసి, స్థానిక సమస్యలపై చర్చించినట్టు తెలిపారు. దీనిపై ఆమె సానుకులంగా స్పందించి సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు ఆయన తెలిపారు.

20న వంచంగిలో 'గడప గడపకు'

రాజవొమ్మంగి: మండలంలోని లోతట్టు ప్రాంతం వంచంగి పంచాయతీ పరిధిలో ఈనెల 20వ తేదీ, శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉన్నట్టు పార్టీ వర్గీయులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి హాజరుకానున్నారు. అందరూ ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, మండల స్థాయి అధికారులు, వలంటీర్లు తదితర సచివాలయ సిబ్బంది హాజరైన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనికోరారు.

విద్యార్థులు విధిగా హాజరుకావాలి

చింతపల్లిరూరల్: విద్యార్థులు పాఠశాల పునః ప్రారంభం రోజే విధిగా హాజరుకావాలని ఏటీడబ్ల్యూవో జయ నాగలక్ష్మి అన్నారు. ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలలు గురువారం పునః ప్రారంభంకానున్నట్టు చెప్పారు. సంక్రాంతి సెలవులకు గృహాలకు వెళ్లిన విద్యార్థులు తొలిరోజే పాఠశాలలకు హాజరుకావాలని ఆదేశించారు. దీంతో బోధన ప్రారంభించేందుకు అనువుగా ఉంటుందన్నారు.

బాధితుడికి చేయూత

జి.మాడుగుల: పాడేరు నేచర్ ఫొటోగ్రఫీ సంఘం సభ్యుడు మసాడి సింహాద్రి అనారోగ్యంతో విశాఖపట్నం గాయత్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకొన్న సంఘం సభ్యులందరూ కలిసి మంగళవారం రూ.10వేల ఆర్థిక సహాయం అందించారు. సంఘం తరఫున తమ వంతు సాయం చేస్తున్నట్టు పలువురు చెప్పారు. దీంతో బాధితుడు సింహద్రి సంఘ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

వచ్చే నెల 5న గాయత్రి మహామృత్యుంజయ హోమం

అడ్డతీగల: మండలంలోని వేటమామిడి శివారున వేంచేసిన రేణుకా ఎల్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఫిబ్రవరి 5న గాయత్రీదేవి మహా మృత్యుంజయ హోమం నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు ముర్ల రాజారెడ్డి తెలిపారు. సకల జనులు సంపూర్ణ ఆరోగ్య రక్షణ కోసం చేపడుతున్న హోమం నిర్వహణకు ఏర్పాట్లు చేశామన్నారు.పెద్ద సంఖ్యలో పాల్గొవాలని కోరారు. ఈనెల 29న వెంకటనగరంలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ మండలంలోని వెంకటనగరంలో ఈనెల 29న హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్టు వనవాసీ కళ్యాణ్ ఆశ్రమ్ సభ్యులు, శ్రీ రేణుకా ఎల్లమ్మ అమ్మవారి ఆలయ అర్చకులు ముర్ల రాజారెడ్డి తెలిపారు.శాస్త్రోక్తంగా ఆ రోజున విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించిన అనంతరం హోమం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొవాలని కోరారు.

నేడు ఐనాడలో 'గడప గడపకు'

పాడేరురూరల్: ఐనాడ పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నామని పాడేరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సిబ్బంది మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పంచాయతీలోని చీకుపనస, కూసర్లపాలెం, గుల్లి, పోతంపాలెం, పూలగరువు, ఐనాడతో పాటు మరో 8 గ్రామాల్లో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఇంటింటా పర్యటించి, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబుతో పాటు, నామినేటెడ్ పదవుల్లో ఉన్న పెద్దలు, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు తప్పనిసరిగా హాజరుకావాలని వారు కోరారు.

శివారు గ్రామాల్లోనూ అభివృద్ధి

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



గ్రామస్తులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, చిత్రంలో ఎంపీపీ నీలవేణి, నేతలు

అనంతగిరి: మన్యంలోని శివారు గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని మారుమూల పెదకోట పంచాయతీ వేలమామిడి, గుమ్మంతి, బొడ్డపుట్టు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో 243 గడపలను ఆయన సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి యోగక్షేమాలు. సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషితో గడప గడప నిధులతో మారుమూల గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే అరకు నియోజకవర్గంలోని పనులు ప్రారంభించినట్టు తెలిపారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సదుపాయం తదితర అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలతో ప్రజల వద్దకే పాలన సాగిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వామని గర్వంగా చెబుతున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారని, అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. గిరిజనుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తోందన్నారు. ప్రభుత్వం పాలనపై ప్రజల్లో సంతృప్తి నెలకొందని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పథకాలకు నాంది పలికారన్నారు. పార్టీలకతీతంగా పారదర్శకంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలుచేస్తోందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీపీ శెట్టి నీలవేణి, వైస్ ఎంపీపీ శకుంతల, సర్పంచ్ అన్నపూర్ణదేవి, మార్కెట్ యార్డు డైరెక్టర్ సూర్యానారయణ, సర్పంచ్‌లు ముత్యాలమ్మ, సీతయ్య, నాయకులు నాగేశ్వరరావు, దేముడు, సోషల్ మీడియా కన్వీనర్ పాంగి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా సచివాలయాల నిర్మాణం

- కిముడుపల్లి, గోమంగి, బొండాపల్లి భవనాల 95 శాతం పనులు పూర్తి
- మండలంలోని 16 భవనాల పనులు ప్రారంభం



ఫెన్సింగ్ స్థాయిలో ఉన్న కిముడుపల్లి గ్రామ సచివాలయ భవనం

పెదబయలు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గ్రామ సచివాలయం వ్యవస్థ ప్రజలకు ఎంతో మేలు చేస్తోంది. ప్రజల వద్దకే సంక్షేమ పథకాలు అందుతుంది. గ్రామ సచివాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని ప్రభుత్వం మండలానికి 16 గ్రామ సచివాలయాలకు భవనాలు మంజూరు చేసింది. మారుమూల సచివాలయాల్లో పనులు కొంత జాప్యం జరుగుతున్నప్పటికీ కిముడుపల్లి, బొండాపల్లి, గోమంగి గ్రామాల్లో 95 శాతం పనులు పూర్తయ్యాయి. అడుగులపుట్టు, గంపరాయి, పర్రెడ, లింగేటి భవనాలు రెండు శ్లాబ్ దశలో పూర్తయ్యాయి. పెదకోడాపల్లి అరడకోట, సీకరి, సీతగుంట భవనాల ఒకటో శ్లాబ్ పనులు పూర్తయ్యాయి. గత ఏడాది వరకు రోడ్డు లేని కారణంగా ప్రారంభం కాని ఇంజరి, జామిగుడ, గిన్నెలకోట గ్రామ సచివాలయాల పనులు కూడా ప్రస్తుతం ప్రారంభమయ్యాయి. ఆయా గ్రామాలకు రహదారి సౌకర్యం కలగడమే ఇందుకు ప్రధాన కారణం. గ్రామ సచివాలయాల భవనాలు పూర్తయితే ప్రజలకు మరింతగా సంక్షేమ కార్యక్రమాలు చేరువకానుంది. భవనాలు పూర్తి దశలో వస్తుండడంతో మండల వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటుగా రైతు భరోసా కేంద్రాలు, వెల్నెట్ సెంటర్లు కూడ నిర్మాణ దశలో ఉన్నాయి.

పూర్తిస్థాయిలో సేవలు



గ్రామ సచివాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణం వేగవంతంగా జరుగుతున్నాయి. ఇప్పటికే మండలంలోని మూడు భవనాలు 95 శాతం పనులు పూర్తయింది. చిన్నపాటి పనులు పూర్తి చేస్తే ప్రారంభోత్సవం చేసుకోవచ్చు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఎంతో సంకల్పంతో రూపుదాల్చిన గ్రామ సచివాలయాల ద్వారా పూర్తిస్థాయిలో సేవలు అందుతున్నాయి. అధికారులు వేగంగా పనులు పూర్తి చేయాలి.

– **కాతారి సురేష్‌కుమార్**, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, పెదబయలు మండలం

త్వరలో పూర్తి చేస్తాం



మండలంలోని కిముడుపల్లి, గోమంగి, బొండాపల్లి భవనాలు 95 శాతం పనులు పూర్తయ్యాయి. ఫెన్సింగ్ పనులు మాత్రమే కొద్దిగా ఉంది. మరో రెండు నెలల్లో మూడు భవనాలు ప్రారంభోత్సవం చేసుకోవడం జరుగుతుంది.దీనికి గాను పెండింగ్ పనులు పూర్తి చేస్తాము.రెండో స్లాబు పనులు పూర్తయిన వాటిని కూడ త్వరలో పూర్తి చేస్తాము. పనులు జరిగిన ప్రాప్తికి బిల్లులు చెల్లించడం జరిగింది.

– **సీహెచ్.సంజీవరావు**, మండల ఇంజినీరింగ్ అధికారి, పెదబయలు మండలం

మృతుడి కుటుంబానికి పరామర్శ



మృతుడు కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న చెట్టి వినయ్

హుకుంపేట: ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి చెట్టి వినయ్ అన్నారు. అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశాల మేరకు గొప్పులపాలెం, వై.బాకురు గ్రామల్లో స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. ఈ నేపథ్యంలో ఆయన గ్రామల్లో గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వై.బాకురు గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పాడి అప్పలస్వామి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఆపదలో ఉన్న పేద గిరిజనులకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. అప్పలస్వామి కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావల్సిన సదుపాయాలు అందేలా కృషి చేస్తామన్నారు. నాయకులు కాంత్‌రాజు, ఒంటుబు, శామ్యూల్ తదితరులున్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



గిరిజనులను పరీక్షిస్తున్న వైద్యులు

చింతపల్లిరూరల్: మండలంలో కోమ్మంగి పంచాయతీ కొలపరి గ్రామంలో మంగళవారం కాకినాడకి చేందిన ట్రినిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో నిపుణులైన వైద్యులు గిరిజనులకు వైద్య సేవలందించారు. శిబిరానికి విశేష స్పందన వచ్చింది.ఈ సందర్భంగా ట్రినిటి ఆస్పత్రి డైరెక్టర్లు రీక్కి గూటం, కిషోర్ మాట్లాడుతూ మన్య ప్రాంత ప్రజలు సూపర్ స్పెషాలిటీ సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యులు విజయ్ మోహన్, మురళి, భరత్, సచివాలయ ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన హక్కులు, చట్టాలు పరిరక్షించాలి

అరకులోయ రూరల్: 1/70 చట్టం రద్దు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స అన్నారు. ఆయన మాట్లాడుతూ గిరిజన హక్కులు, చట్టాలపై విస్తృత అవగాహన కల్పించారన్నారు. చట్టాల పరిరక్షించుకునేందుకు అందరూ సమష్టిగా పోరాటం చేయాలన్నారు. నాయకులు సురేంద్ర, బాలదేవ్, సత్యానారయణ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

రాజవొమ్మంగి: మండలంలోని శరభవరం సచివాలయంలో రెండు వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో బాపన్నదొర మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. శరభవరం సచివాలయంలో ఖాళీగా ఉన్న రెండు పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 18 నుంచి 20 తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

జీవన పోరాటం



జి.మాడుగులలో తాడుపై విన్యాసం చేస్తున్న బాలిక

జి.మాడుగుల: కూటి కోసం కోటి విద్యలు (విన్యాసాలు)అన్న నానుడి నిజ జీవితంలో దర్శనమిస్తోంది. మండల కేంద్రంలో మెయిన్ రోడ్డు వద్ద మంగళవారం ఓ బాలిక తాడుపై చేసిన ఫీట్ ఆకట్టుకుంది. తాడుపై సైకిల్‌వీల్, తలపై స్టీల్ చెంబులు చేతిలో కర్రతో ఎనిమిది అడుగల ఎత్తులో తాడుపై ఓ చివరి నుంచి మరో చివరి వరకు చేసిన విన్యాసంతో స్థానికులు ఓ వైపు.. ఆనందం మరోవైపు భయపడ్డారు. ఏ మాత్రం అదుపు తప్పినా ప్రమాదం అని పలువురు చెబుతున్నారు.

సందడే సందడి



సంబరాల్లో గ్రామస్తుల సందడి



థింసా నృత్యం చేస్తున్న ఎంపీపీ బాక ఈశ్వరి



రాజవొమ్మంగిలోని థియేటర్ వద్ద ప్రేక్షకుల సందడి

- గ్రామాల్లో పండగ సంబరాలు

దుంబ్రిగుడ: సంక్రాంతి సంబరాలు పల్లెల్లో ఘనంగా జరుపుకున్నారు. గ్రామాలన్నీ సందడిగా దర్శనమిచ్చాయి. భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ పండగలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చిన కుటుంబీకులు, బంధువులు, మిత్రులతో ఇళ్లన్నీ కళకళలాడాయి. ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరిసింది. పండగలను ఎంతో ఉల్లాసంగా...ఉత్సాహంగా జరుపుకొని, తిరుగు ప్రయాణానికి సన్నద్ధమయ్యారు.

ఉల్లాసంగా థింసా నృత్యాలు

దుంబ్రిగుడ: మండలంలోని సొవ్వ పంచాయతీ కమలబంధ, మాలివలసతో పాటు మండల కేంద్రంలో మంగళవారం జరుపుకున్న ముక్కనుమ వేడుకను పురస్కరించుకొని థింసా నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బాక ఈశ్వరి గ్రామస్తులతో కలిసి సంప్రదాయ థింసా నృత్యం చేసి సందడి చేశారు. నాయకులు అశోక్‌కుమార్, సింహాచలం, నర్సింగ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పది రోజుల పండగ

జి.మాడుగుల: గిరిజన గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు కొనసాగుతున్నాయి. గిరిజన సంస్కృతి, సంప్రదాయలు ప్రకారం వారం రోజుల నుంచి 10 రోజుల వరకు పలు గ్రామాల్లో సంక్రాంతి ఉత్సవాలు నిర్వహించడం అనవాయితీ. ప్రతీ సంవత్సరం జనవరి నెలలో వచ్చే సంక్రాంతి పండుగ ఉత్సవాలు తమ తమ గ్రామాల్లో గొట్టిపండు(గ్రామస్తులందరు ఒక చోట సమావేశం) నిర్వహించేంత వరకు జరుగుతాయి. ప్రతీ గ్రామంలో మహిళలు థింసా నృత్యాలు, గిరిజనులు విచిత్ర వేషధారణ, కోలాటాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేస్తారు.ప్రతీ గ్రామానికి గ్రామపెద్ద, గ్రామ పూజారి, చల్లనివాడు(బార్కీ)పశువులు కాపరి (గొల్లవాడు)గ్రామస్తులందరు ఏకాభిప్రాయంతో జీత భత్యాలు నిర్ణయించి ఎంపిక చేస్తారు. పండగ సంబరాల్లో భాగంగా పాడేరు మండలం లగిసపల్లి గ్రామాల్లో జి.మాడుగుల జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి మహిళలతో కలిసి థింసా నృత్యం చేసి అలరించారు.

సినిమాహాలుకు పూర్వవైభవం

రాజవొమ్మంగి: మండల కేంద్రంలో దాదాపు దశాబ్దంన్నరగా కనుమరుగైన సినిమా సందడి సంక్రాంతి సందర్భంగా తిరిగి కనిపిస్తోంది.డివిజన్ పరిధిలో ఎక్కడా థియేటర్లు లేవు. పండగకు స్థానిక వెంకటేశ్వర థియేటర్‌ను ప్రారంభించారు. ప్రస్తుతం థియేటర్‌లో ప్రదర్శిస్తున్న వీరసింహారెడ్డి, వాల్తేర్ వీరయ్య సినిమాలకు ప్రేక్షకులు తరలివచ్చారు. సంక్రాంతి పండగను పురస్కరించుకొని స్థానిక సినిమాహాలు పూర్వవైభవాన్ని సంతరించుకొని కళకళలాడుతోంది.

ముగిసిన వాలీబాల్, ముగ్గుల పోటీలు



కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు



దోనెలపాలెంలో ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు



ముగ్గుల పోటీల విజేతలకు బహుమతి అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

రాజవొమ్మంగి: సంక్రాంతి సందర్భంగా మండలంలోని గడుకుర్తి సచివాలయంలోని దోనెలపాలెం గ్రామంలో వరుసగా రెండురోజుల పాటు వాలీబాల్, ముగ్గుల పోటీలు జరిగాయి. విజేతలకు సర్పంచ్ సవిరెల చంద్రులు సోమవారం బహుమతులు అందజేశారు. వాలీబాల్ పోటీల్లో చిన్నయ్యపాలెం టీం విన్నర్‌గా, రేవటిపాలెం గ్రామానికి చెందిన యువకులు రన్నర్స్ స్థానాన్ని కైవసం చేసుకొన్నారు. పోటీల్లో మొత్తం 14 టీంలు పాల్గొన్నాయి. కాగా బహుమతులు అందుకొన్న వారిలో టీం లీడర్లు గురు, దుర్గ, నాని, కోటి ఉన్నారు. ముగ్గుల పోటీ విజేతలు.. దోనెలపాలెంలో జరిగిన ముగ్గుల పోటీల్లో వీర వెంకట సత్యవతి, సీతారత్నం బహుమతులు అందుకొన్నారు. గ్రామ పెద్దలు మైలబోయిన ప్రసాద్, వెంకటరమణ, అమ్మాజి, వెంకటలక్ష్మి, లోవరాజు, సూరిబాబు, నాగేశ్వరరావు తదతరులు పాల్గొన్నారు.

వై.రామవరం: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలోని చింతకర్రపాలెం గ్రామంలో గత మూడు రోజులుగా నిర్వహించిన ముగ్గులు, వాలీబాల్ తదితర ఆటల పోటీల విజేతలకు మంగళవారం ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా బహుమతి అందజేశారు. గ్రామ ఎంప్లాయిస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి, సర్పంచ్ పల్లాల బాలురెడ్డి, తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతు ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని జరపాలని గ్రామ ఉద్యోగ కమిటీ పెద్దలకు సూచించారు. గ్రామ ఉద్యోగ సంఘం నిర్వహిస్తున్న ఇటువంటి కార్యక్రమాల్లో ఎక్కువ సంఖ్యలో గ్రామస్తులు పాల్గొవాలని సూచించారు. అనంతరం ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ముగ్గులు పోటీల విజేతలకు బహుమతి అందజేశారు. భారీ ఎత్తున గ్రామ ప్రజలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత రఘునాథ్

అరకులోయ రూరల్: టీడీపీ కుట్రలను తిప్పికొట్టాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత సమర్డి రఘునాథ్ అన్నారు, మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో మంగళవారం సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ పార్టీ మరింత బలోపేతానికి పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై గ్రామ స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రభుత్వంపై వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నాయకులు శెట్టి అప్పాలు, రామరావు, దొన్ను, సుంక్ర, హస్తినకుమార్, నర్సింగరావు, యాసీన్, గురు,శివ, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తీర్థాల కోలాహలం



రైవాడ జలాశయానికి పోటెత్తిన భక్తజనం

కె.కోటపాడు: గొండుపాలెం గ్రామ దేవత దండుముత్యాలమ్మ తీర్థాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులతోపాటు దేవరాపల్లి, చోడవరం, చీడికాడ మండలాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. సర్పంచ్ బండారు కనకమల్లీశ్వరి, మాజీ సర్పంచ్ వంటాకు శ్రీను, వైస్ ఎంపీపీ బండారు మంగపతి, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ దొగ్గ ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు. భక్తులకు కానిస్టేబుళ్లు కూండ్రపు సూర్యనారాయణమూర్తి, రమేష్ ప్రసాద వితరణ చేశారు.

సాగరంలో..

మాడుగుల: సాగరం గ్రామంలో మంగళవారం రాములోరి తీర్థం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు రాములోరిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ తీర్థానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తలిర వచ్చారు.

గొలుగొండ: సాలికమల్లవరంలో మంగళవారం తీర్థం ఘనంగా నిర్వహించారు. ఇక్కడ రామాలయం వద్ద ఈ ఉత్సవానికి జోగుంపేట, పాతజోగుంపేట, జమ్మేదేవిపేట, వెంకటాపురం, పుగచెట్లపాలెం గ్రామాల భక్తులు అధికంగా తరలివచ్చారు. సాయంత్రం పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

కె.జె.పురంలో...

మాడుగుల రూరల్: కె.జె.పురంలో సంక్రాంతి పండగ నుంచి ఈ నెలాఖరి వరకు రోజూ తీర్థాలు నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా మంగళవారం మోదమాంబ అమ్మవారి తీర్థం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

నేడు అక్కమ్మ పేరంటాలు తీర్థం

కె.జె.పురం గ్రామ శివారు తెలకలదీపంలో అక్కమ్మ పేరంటాలు తీర్థం బుధవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా ఎరకాలమ్మ తీర్థం

దేవరాపల్లి: రైవాడ గ్రామస్తుల ఆరాధ్య దైవం ఎరకాలమ్మ తీర్థం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా రైవాడ జలాశయం వద్ద ఆలయానికి తెల్లవారుజాము నుంచి అమ్మవారిని వేలాది భక్తులు దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. సర్పంచ్ చల్లా లక్ష్మి, వైస్ ఎంపీపీ ఉగ్రాకుల గంగాభవానీ, మాజీ సర్పంచ్ చల్లా తాతయ్యలు, కె.ఎస్. అప్పలనాయుడు తదితర గ్రామ పెద్దలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా క్రికెట్, కబడ్డీ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. తీర్థం సందర్భంగా రైవాడ జలాశయానికి భక్తజనం పోటెత్తారు. దీంతో జలాశయం పరిసరాలు కనుచూప మేర కిక్కిరిసింది.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

జి.మాడుగుల: పొత్తడిగొంది గ్రామంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు వి.మహేష్ మాట్లాడుతూ మన్యంలో చేపట్టనున్న హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులను రద్దు చేయాలన్నారు. గ్రీన్ ఎనర్జీ పేరుతో చేపట్టనున్న పవర్ ప్రాజెక్టు కోసం అడవులు ధ్వంసమవుతాయని దీన్ని అడ్డుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. కొండబాబు, శ్రీను, పండన్న, బాలరాజు,రత్నాలమ్మ తదితరలు పాల్గొన్నారు.